క్లుప్తంగా

మే 25లోగా సమ్మతి పత్రాలు ఇవ్వాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు మే 25వ తేదీలోగా బ్యాంకులు సమ్మతి పత్రాలు ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ యువ వికాసంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. బ్యాంకర్లు రాజీవ్ యువ వికాసం పథకం కింద గుర్తించిన లబ్ధిదారులకు సమ్మతి ఇవ్వడంలో జాప్యం చేయవద్దని ఆదేశించారు. లబ్ధిదారులందరికీ బ్యాంకుల్లో జీరో అకౌంట్ ప్రారంభించాలని తెలిపారు. లబ్ధిదారులకు మంజూరు చేసే సబ్సిడీ మొత్తం ఈ జీరో అకౌంట్లలో జమ అవుతుందన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం శ్రమిక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణ కేంద్రంలో పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ మహేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ బంగారుగడ్డ ఫీడర్ లైన్ పనుల నేపథ్యంలో బంగారుగడ్డ, సీతారాంపురం, రాజీవ్‌చౌక్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన

అడవిదేవులపల్లి : బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆశ్రిత ఎన్జీవో కమ్యూనిటీ సోషల్ వర్కర్ రాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆశ్రిత ఎన్జీఏ కమ్యూనిటీ సోషల్ వర్కర్ రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహాలు,, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సీహెచ్‌ఓ షాహిద్, అంగన్‌వాడీ టీచర్లు రమ, మణెమ్మ, సరిత, రోజా. శోభ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని నిల్వ ఉంచొద్దు

డిండి : మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కాంటా అయిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కేటాయించిన మిల్లులకు తరలించాలని తహసీల్దార్ ఆంజనేయులు సబంధితాధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చెర్కుపల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బీసీ సంఘం నాయకుల ముందస్తు అరెస్టు

మిర్యాలగూడ అర్బన్ : పెండిగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా మిర్యాలగూడలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్‌ను ఆయన నివాసంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ చేపట్టే జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడికి వెళ్లకుండా అరెస్టులు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఎన్నిక


నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

మిర్యాలగూడ : నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మిర్యాలగూడ పట్టణ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం పట్టణ అధ్యక్షుడిగా రాయించు నరసింహ, కార్యదర్శిగా మేడపల్లి సైదులు, కోశాధికారిగా రాచమల్ల వెంకన్నలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆలగడప గిరిధర్, జిల్లా అధ్యక్షుడు నేలపట్ల రమేష్ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు ఐక్యంగా ఉండి తమ హక్కులను పరిష్కరించుకోవాలన్నారు. సంఘంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, కేతేపల్లి యాదగిరి, జంపాల సత్యనారాయణ, హనుమంతు, గోలి యాదగిరి, నాగబెల్లి యాదగిరి, జాజుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వసతుల లేమితో అవస్థలు

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు
- అరకొర వసతుల మధ్య విధులు
- తాగునీరు సైతం కరువు
- సొంత భవనాలు ఏర్పాటు చేయాలని వేడుకోలు


అద్దె భవనంలో కొనసాగుతున్న కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో అద్దె భవనాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక వసతులు లేకపోవడంతో అటు ఉద్యోగులు, ఇటు ఆయా కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం కొండమల్లేపల్లి మేజర్ గ్రామపంచాయతీ సుమారు తొమ్మిదేళ్ల క్రితం మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాల ఏర్పాటుకు నోచుకోకపోగా ఇప్పటికే ఏర్పాటు చేసిన పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం వసతుల లేమి వేధిస్తోంది.

వసతులు లేక ఇబ్బందులు

కొండమల్లేపల్లి మండల కేంద్రం ఏర్పాటయ్యాక నూతన ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటులో భాగంగా మొదటగా పోలీస్ స్టేషన్, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయాలతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఇందులో భాగంగా తహసీల్దార్, వ్యవసాయ శాఖ కార్యాలయాలను దేవరకొండ రోడ్డులోని పట్టు పరిశ్రమలోని పాత భవనాల్లో ఏర్పాటు చేయగా పోలీస్ స్టేషన్‌ను హైదరాబాద్ రోడ్డులోని ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండల పరిషత్‌కార్యాలయాన్ని మొదటగా వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులోని ఓ భవనంలో కొద్ది రోజులు కొనసాగించిన అనంతరం దోనియాల గ్రామపంచాయతీ శివారులో గల ఎస్సెల్బీసీ కార్యాలయానికి మార్చగా.. ప్రస్తుతం అక్కడే కొనసాగుతుంది. కాగా పట్టు పరిశ్రమకు చెందిన పాత భవనాల్లోనే తహసీల్దార్, వ్యవసాయ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేయగా ఆయా కార్యాలయాల్లో కనీసం మౌలిక వసతులు కూడా లేకపోవడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు, అధికారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సుమారు 25 మంది సిబ్బంది పని చేస్తుంటారు. అదే విధంగా వ్యవసాయ శాఖ కేవలం ఒకే గదిలో కొనసాగుతుంది. ఏఓ, ఏఈఓలు విధుల నిర్వహణతో పాటు మట్టి నమూనా పరీక్షల యంత్రాలు, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు, మట్టి నమూనాల నుంచి సేకరించిన శాంపిల్స్ భద్రపర్చేందుకు అవసరమైన గదులు లేవు. అంతేగాక ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో పాటు వ్యవసాయ కార్యాలయానికి కనీసం మరుగుదొడ్ల సౌకర్యం లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో రైతు వేదికల ద్వారా వ్యవసాయ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు.

సొంత భవనాలు ఏర్పాటు చేయాలి

కొండమల్లేపల్లి మేజర్ గ్రామపంచాయతీ నుంచి మండల కేంద్రంగా ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతుంది. ఇప్పటికి ప్రభుత్వ కార్యాలయాలు కేవలం అద్దె భవనాల్లో మౌలిక వసతులు లేక కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పక్కా సొంత భవనాలు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలి.

– ఎం. యాదగిరి, కొండమల్లేపల్లి

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

- అమృత్ పనులు వేగవంతం చేయాలి
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర అభివృద్ధిలో మిర్యాలగూడ మున్సిపాలిటీ ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లుతో కలిసి అధికారులు, డిజైనింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలను చేపట్టాలన్నారు. అదే విధంగా మున్సిపాలిటీలో భూగర్భ డ్రెయినేజీ చాలా ప్రాంతాల్లో మురుగనీరు లీకవుతుందని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఉపయోగం లేని భూములను స్వాధీనం చేసుకొని ఆ ప్రాంతాల్లో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాలను చేపట్టాలన్నారు. దీంతో పాటు డాక్టర్స్ కాలనీలో ఆస్పత్రి వ్యర్థాలను చెత్త ఆటోలో వేయకుండా ముందస్తుగా వారికి నోటీసులను జారీ చేయాలన్నారు. హిందూ స్మశాన వాటికపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి మంచిగా క్లీనింగ్ చేయాలని సూచించారు. అమృత్ పథకం కింద చేపట్టని పనులను వెంటనే పనులను చేపట్టాలని కోరారు. ఈ అమృత్ 2.0 పథకం కింద పట్టణంలోని నందిపాడు, ఎంపీడీవో కార్యాలయం, ఎన్ఎస్‌పీ క్యాంపు, ప్రకాశ్‌నగర్, తాళ్లగడ్డ, గ్రీన్‌సిటీ, మార్కెట్ యార్డుల్లో ఒక్కొక్కటి కాగా హౌజింగ్‌బోర్డు, ఇందిరమ్మ కాలనీలో రెండు ట్యాంకులను నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టలన్నారు. ఈ సమావేశంలో నల్లగొండ పబ్లిక్ హెల్త్ డీఈ మనోరమ, మున్సిపల్ డీఈఈ వెంకన్న, కెఎస్ఆర్‌సీ ప్రాజెక్టు మేనేజర్ చెన్నూరి బాపూజి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రాజెక్టు డిజైనర్లు సురేష్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డిప్యూటి కంట్రోలర్ రోహిత్, పబ్లిక్ హెల్త్ ఏఈ సాయితేజ, పబ్లిక్ హెల్త్ డిజైనర్లు కల్యాణ్, కార్తీకేయయ తదితరులున్నారు.

ధాన్యం తడిస్తే కమీషన్ కట్ చేస్తాం

- కొనుగోలు కేంద్రం నిర్వాహకులను హెచ్చరించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి


ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర : కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యం వర్షానికి తడిస్తే మీకిచ్చే కమీషన్ కట్ చేసి రైతులకు ఇస్తామని కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పెద్దవూర, లింగంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేయగా అక్కడ అధిక మొత్తంలో కాంటా వేసిన బ్యాగులు నిల్వ ఉండడంతో త్వరగా మిల్లులకు తరలించాలని తెలిపారు. అంతకముందు కొనుగోలు కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. లారీలు అందుబాటు, కొనుగోలు చేసిన ధాన్యం, చెల్లింపులు, సౌకర్యాలు తదితర వివరాలను పీఏసీఎస్ సీఈఓ వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన లేకపోవడం, విధులపై అలసత్వం కారణంగా నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని అధికారులకు సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం దించుకునేందుకు ఆలస్యమయ్యేలా ఉంటే తక్షణమే వేర్ హౌసింగ్ గోదాముకు పంపించాలన్నారు. ట్రాన్స్‌పోర్టు నిర్వహకుడితో ఫోన్‌లో మాట్లాడి కొనుగోలు కేంద్రాలకు లారీలు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇలాగే వ్యవహరిస్తే లారీ కిరాయిల బిల్లులు నిలిపివేస్తానని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి రోజు ఆయా మండలాల తహసీల్దార్లు సందర్శించి సరైన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కాంటాలు వేయించి మిల్లులకు పంపించాలని పేర్కొన్నారు. కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. కలెక్టర్ వెంట మిర్యాలగూడెం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, జిల్లా కో–ఆపరేటీవ్ అధికారి పత్యానాయక్, తహసిల్దార్ ఎం.శ్రీనివాసులు, ఏఓ సందీప్, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మనోహర్, ఏఈఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఆయిల్ పాం తోట దగ్ధం

అడవిదేవులపల్లి : ప్రమాదవశాత్తు ఆయిల్‌పాం తోట దగ్ధమైన ఘటన మండలంలో చోట చేసుకుంది. మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన మంచికలపూడి శంకర్‌రావు అనే వ్యక్తి గ్రామ శివారులో 20ఎకరాల్లో ఆయిల్ పాం మొక్కలు, చెట్లు పెంచుతున్నాడు. ఈ తోటలో మొత్తం 1100 మొక్కల వరకు రెండేళ్ల వయస్సు ఉన్నాయి. శంకర్‌రావు పక్కనే ఉన్న మరో రైతుకు చెందిన ఎండిన పత్తి కట్టేను తగులబెట్టే క్రమంలో ఆ ఎండు కట్టెలు, గడ్డికి మంటలు అంటుకొని ఆయిల్‌ఫాం తోటకు తగిలింది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడుతుండటంతో పాటు ఆయిల్‌ఫాం మొక్కలు, డ్రిప్, విద్యుత్ పరికరాలు పూర్తిగా కాలిపోయి బుడిదయ్యాయి. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఉద్యానవన డివిజనల్ అధికారి డి. సుధాకర్ ప్రమాద సంఘటనకు చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మే డేను విజయవంతం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి : ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే)ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద మేడే పోస్టర్ ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జయరాములు, మల్లయ్య, దేవదాసు, తావు, వెంకటయ్య ఉన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే)ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సయాద్ అన్నారు. మంగళవారం కారు, జీపు అడ్డా వద్ద పట్టణంలోనిప్రధాన కూడలిలో సీపీఐ ఏఐటీయూసీ దిమ్మెలకు రంగులు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అస్గర్, గోపానాయక్, వెంకన్న, శ్రీనివాసరాజు, జానయ్య, రఫి, పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్ఓ తనిఖీ


ఓ ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను జిల్లా వైద్యాధికారి పుట్టల శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో ఆయా ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ రెన్యువల్‌తో పాటు రెడియాలజిస్టు, పెథాలజిస్టు, ఫైర్‌సేఫ్టీలను పరిశీలించారు. రోగులకు అందించే వైద్య సేవలకు వసూలు చేస్తున్న ఫీజుల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పలు ఆస్పత్రుల్లో వైద్యుల అర్హతలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తే ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని ఏడు ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చిన వారిని హెచ్చరించారు. ఆస్పత్రులను తనిఖీ చేసే సమయంలో మీడియాకు సమాచారం అందించకుండా గోప్యంగా తనిఖీ చేశారు. తనిఖీల విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు వెళ్లగా ఎలాంటి ప్రకటన చేకుండానే సదరు జిల్లా వైద్యాధికారి వెళ్లిపోయారు. ఈ తనిఖీల్లో పీఓ డాక్టర్ అరుంధతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ కేశా రవి, సీహెచ్ఓ నర్సింహ, మోతీలాల్, హెచ్ఈఓ ప్రభాకర్, డీఈవో రమేష్ తో హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ : మండలంలోని ధీరావత్‌తండా పంచాయతీ కార్యదర్శి కోల సాయికుమార్‌పై దుర్భాషలాడి దాడి చేసిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో, ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. సోమవారం వెరిఫికేషన్ ఆఫీసర్, ఇరిగేషన్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి కోల సాయికుమార్ ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ కోసం గ్రామానికి వెళ్లారని తెలిపారు. ఆ గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి తను చెప్పిన పేర్లు ఎందుకు లిస్ట్‌లో నమోదు చేయలేదని పంచాయతీ కార్యదర్శిని దుర్భాషలాడి దాడి చేసినట్లు తెలిపారు. దాడి చేసిన వ్యక్తి నాగరాజుపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా సర్వేను పూర్తిగా వెరిఫికేషన్ ఆఫీసర్‌కు కేటాయించి సర్వే సమయాన్ని సాయంత్రం వేళల్లో కాకుండా ఉదయం వేళల్లో చేసేలా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూకల రవీందర్‌రెడ్డి, మాధవరెడ్డి, భద్రయ్య, కోడిరెక్క శైలజ, బంటు మహేష్, రమణ, రవికిరణ్, జగదీశ్ పాల్గొన్నారు.


కొండమల్లేపల్లి : ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కొండమల్లేపల్లి : మిర్యాలగూడ మండల పరిధిలోని ధీరావత్‌తండాలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎంక్వయిరి నిర్వహిస్తున్న సమయంలో దాడిచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని స్థానిక ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల డివిజన్ అధ్యక్షులు జైహిందర్, శిరీష, శంకరయ్య, అనిత, రఘు, ప్రవీణ్, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

లీకేజీలతో తాగునీరు వృథా


పందిరిగుండు తండాలో నీటి ట్యాంకు నుంచి వృథాగా పోతున్న తాగునీరు


మండలంలోని రేకులగడ్డ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

చందంపేట : అసలే వేసవి కాలం.. తాగునీటి కోసం ఇబ్బందులు ఎదురయ్యే వేసవిలో నీటి వృథాను అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నేరెడుగొమ్ము మండలంలోని పందిరిగుండు తండాలో పదివేల లీటర్ల సామర్థ్యమున్న తాగునీటి ట్యాంకు నీరు లీకేజీతో నీరు వృథా అవుతుంది.. చందంపేట మండలంలోని రేకులగడ్డ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ చాలా రోజులుగా నీరు లీకేజీ అవుతూనే ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రోజుల తరబడి అధికారులకు విన్నవించుకుంటున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని, దీంతో విలువైన తాగునీరు వృథాగా పారుతుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి నీటి లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎస్ఐ

పెద్దఅడిశర్లపల్లి : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు అన్నారు. మంగళవారం మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద పోలీస్ స్టేషన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాహనదారులు వాహన పత్రాలు, లైసెన్స్, ఆర్‌సీ తదితర ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. లేకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాజాతా బృందం జమిదార్ రాజు, గుడిపల్లి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


మిర్యాలగూడ టౌన్ : చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


నిడమనూరు : చెక్కు అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యం, నాయకులు

మిర్యాలగూడ టౌన్ : నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని 25వ వార్డుకు చెందిన కలీంకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. ఆపదలో ఉన్న వారిని అదుకునేందుకు సీఎం సహాయ నిధి నుంచి ముఖ్యమంత్రి నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల వెంకటయ్య, నిమ్మల సైదమ్మకు మంజూరైన మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు, గ్రామ శాఖ అధ్యక్షులు జంగిలి లింగయ్యల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గోదాల జానకిరాంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, రేపాల మధు నాయకులు దామ సైదదులు యాదవ్, జంగిలి లింగయ్య యాదవ్, ధీరావత్ లింగానాయక్, రామయ్య, కృష్ణ, శివ, నరేష్, బడేటి సైదులు తదితరులున్నారు.

నిడమనూరు : మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన గోశెట్టి జ్యోతికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.40వేల చెక్కును మంగళవారం మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అందజేశారు. ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి సహకారంతో ఈ చెక్కు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ ముంగి శివమారయ్య, నర్సింగ్ విజయ్ కుమార్, ఆల్లంపల్లి శ్రీను, మైసయ్య, కోట్ల సైదయ్య, కంచి రవి, పగిళ్ల సైదులు తదితరులు ఉన్నారు.

ఇళ్ల సర్వే రెండు రోజుల్లో పూర్తి చేయాలి

వేములపల్లి : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను రెండు రోజుల్లో పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ రికార్డుల నిర్వహణను సమర్థంతంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శారదాదేవి, సూపరింటెండెంట్ సత్యప్రభ తదితరులు ఉన్నారు.


ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు, విద్యార్థులు

దేవరకొండ : నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్ , ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16నెలలు గడుస్తున్నా విద్యార్థి ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంటవిడుదల చేయకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో అనంద్, సుధాకర్, సహదేవుడు, శ్రీను, వెంకటేశ్వర్లు, మోహన్, గోవిందు, చంద్రమౌళి, లక్ష్మణ్, గోపినాయక్, మోతిలాల్, పాల్గొన్నారు.

తీరనున్న విద్యుత్ కష్టాలు

- ప్రారంభానికి సిద్ధంగా వేంపాడు సబ్ స్టేషన్
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


వేంపాడు సబ్ స్టేషన్

నిడమనూరు : మండలంలోని రైతులకు త్వరలో నాణ్యమైన విద్యుత్ అందనుంది. వేంపాడులో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయింది. దీంతో విద్యుత్ కష్టాలు తీరనున్నాయి. వేంపాడు సబ్‌స్టేషన్‌తో వేంపాడు, పార్వతీపురం, రామాపురం, వెంగన్నగూడెం, గగినపల్లివారిగూడెం, కుమ్మరిగూడెం గ్రామాలకు, గృహ, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మెరుగైన విద్యుత్ సరఫరా అవుతోంది. సబ్ స్టేషన్ నాన్–ఆయకట్టు ప్రాంతంలో ఉండటంతో వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుంది. మెరుగైన విద్యుత్‌తో మోటార్లు కాలిపోవడం, స్టాటర్లు పేలిపోవడం ఘటనలు తగ్గిపోతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక సబ్ స్టేషన్ పక్కనే రెండు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వాటి మోటార్లకు కూడా నాణ్యమైన విద్యుత్ అందనుంది. గతంలో లోఓల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోయేవి. సబ్ స్టేషన్ ఏర్పాటుతో ఆ సమస్య తీరనుంది.

ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు..

ట్రయల్ రన్ అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సబ్ స్టేషన్‌లో 5ఎంవీఏ విద్యుత్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ లోడుకు అనుగుణంగా ఫీడర్ పనులు, కేపాసిటర్లు, కాపర్ బెడ్ నిర్మాణాలు పూర్తి చేశారు.

మెరుగైన విద్యుత్ అందిస్తాం



మండలంలో లో–ఓల్టేజీ సమస్య పరిష్కారం కానుంది. మే నెలలో వేంపాడు సబ్ స్టేషన్ ప్రారంభానికి ఏర్పాటు చేస్తున్నాం. రూ.2.35 కోట్లతో పనులు చేపడుతున్నాం. ఎర్రబెల్లి, తుమ్మడం విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

– ఏఈ సరేష్ కుమార్